క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం



విష్ణు సహస్రం పారాయం చేస్తున్న భక్తులు

మునగపాక : మునగపాకలో నూతనంగా నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర రామాలయం స్థలంలో ఆదివారం విష్ణు సహస్ర నామాలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 19న మునగపాకలో భారీగా ఆలయ శంకుస్థాపన చేపట్టనున్న నేపథ్యంలో సంబంధిత స్థలంలో మునగపాక అన్నమయ్య స్వర తరంగిణి కన్వీనర్ వెలగా ప్రవీణ సారథ్యంలో భక్తులు పలు నామాలు ఆలపించారు.

రూ.26 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం



డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

పాయకరావుపేట : పట్టణంలోని జగతా శేషయ్య నగర్ రోడ్డులో సుమారు రూ.26 లక్షలతో మండల పరిషత్ నిధులతో కిలోమీటరు పొడవునా డ్రైనేజీ నిర్మాణ పనుల కార్యక్రమానికి శంకుస్థాపన పనులు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, సర్పంచ్ గారా ఉషశ్రీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ఎంపీటీసీ గుల్లా దివ్య నాగరాజు, వార్డు సభ్యులు పిరాధి రాజు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న సమన్వయకర్త కంబాల జోగులు తదితరులు

నక్కపల్లి : చందనాడ గ్రామంలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారికిఉదయం నుంచి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. చందనాడ, తమ్మయ్యపేట తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని కానుకలు మొక్కుబడులు సమర్పించుకున్నారు. పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీలు గంటా తిరుపతిరావు, లొడగల చంద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తళ్ల అప్పలస్వామి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.భక్తులకు ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

రాంబిల్లి : విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 13న అచ్యుతాపురం సబ్ డివిజన్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫోరం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో అచ్యుతాపురం సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులందరూ తమ సమస్యలతో పాటు నిర్వహణపై తగు సూచనలు, సలహాలు అందించాలని ఆయన కోరారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఈ సూచించారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్టు

మునగపాక : చూచుకొండలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ ప్రసాదరావు తన సిబ్బందితో దాడి చేసి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకొన్నట్టు తెలిపారు.

రాంబిల్లి : అక్రమంగా మద్యం నిల్వ చేసిన కేసులో ఆదివారం ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వా వద్ద నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎస్. లక్ష్మణరావు తెలిపారు.

వలస జీవుల బతుకు బాట

- పొట్ట చేతపట్టుకుని వందల కిలోమీటర్ల పయనం
- వ్యవసాయ పనిముట్లు, కిచెన్ వస్తువుల తయారీ
- ఏటా ఆరు నెలల పాటు సంచార జీవనం



యలమంచిలిలో వలస కార్మికుల బస



కళాయి తయారు చేస్తున్న వలస కూలీ

యలమంచిలి రూరల్ : కష్టాన్నే నమ్ముకున్న వారికి భాష, ప్రాంతంతో పనిలేదని నిరూపిస్తున్నారు మధ్యప్రదేశ్ నుంచి మన రాష్ట్రానికి వలస వస్తున్న కష్ట జీవులు. కొలిమిలో ఇనుమును కరిగించి..రెక్కలు ముక్కలు చేసుకుంటూ వ్యవసాయ పనిముట్లు తయారు చేసి అమ్ముకుంటూ కుటుంబాలను పోషించుకోవడం.. ఇదొక్కటే తరతరాలుగా వాళ్లకు తెలిసిన పని. మహిళలు కొలిమి వేసి పాత ఇనుము కాలిస్తే పురుషులు సమ్మెట వేస్తూ వస్తువులు తయారు చేస్తుంటారు. గొడ్డలి, కొడవలి, కత్తులు, గడ్డ పారలు, పారలు, సమ్మెట, కళాయి, చపాతీ పెనం, కురిడీ, వంటింటి కత్తి పీటలు ఇలా వ్యవసాయానికి, ఇళ్లలో వినియోగించే పనిముట్లను వీరు తయారు చేసి రోడ్డు పక్కనే టార్పాలిన్లపై ఆ వస్తువులను అమ్మకానికి ఉంచుతారు. కొందరు పట్టణంలోని వీధులు, చుట్టు పక్కల ఊళ్లలో వీటిని తీసుకెళ్లి విక్రయిస్తూ బతుకు పోరాటం చేస్తున్నారు. ఎక్కడ వరికోతలు ఉంటే ఆ ప్రాంతంలో ఈ పనిముట్లు ఎక్కువగా విక్రయించడానికి బయలుదేరి పోతుంటారు. ఇలా ఒకరో ఇద్దరో కాదుఏటా మధ్యప్రదేశ్ నుంచి కొన్ని వందల కుటుంబాలు ఆంధ్రప్రదేశ్‌కు పొట్ట చేత పట్టుకుని వస్తున్నారు. ఏడాదిలో ఆరు నెలలు ఊరూరా తిరుగుతూ వ్యవసాయ పనిముట్లు, వంట గదుల్లో ఉపయోగించే వివిధ రకాల వస్తువులను తయారుచేసి వాటిని అమ్ముకుంటూ నాలుగు డబ్బులు సంపాదించుకుని, తిరిగి సొంతూళ్లకు వెళ్లి జీవనం సాగిస్తుంటారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖండవా జిల్లా ముందిగం మండలం నింబాడ్ ప్రాంతానికి చెందిన వలస కార్మికులు 10 కుటుంబాలు అనకాపల్లి జిల్లాలో వివిధ పట్టణాలకు వలస వచ్చారు. యలమంచిలిలో ప్రధాన రహదారి పక్కన త్రిమూర్తులు స్వామి గుడి సమీపంలో గుడారాలు వేసుకున్నారు.



రోటీ తయారు చేస్తున్న మహిళ

డొక్కాడాలంటే రెక్కాడాల్సిందే..

యాంత్రీకరణ గణనీయంగా పెరిగిన ఈ రోజుల్లోనూ వారు చేతి వత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఉదయం 7 గంటలకు మొదలయ్యే పని రాత్రి 7 వరకూ కొనసాగుతూనే ఉంటుంది. లారీల క్లచ్ ప్లేట్లు, ఇతర పాత ఇనుమును కొలిమిలో కాల్చి ఇనుమును కరిగించిన తర్వాత సమ్మెట సాయంతో అమ్మకానికి అవసరమైన పనిముట్లు తయారు చేస్తుంటారు. కొడవలి సైజును బట్టి రూ.50 నుంచి రూ.200 వరకు, గొడ్డలి రూ.150 నుంచి రూ.300 వరకు మాంసం కత్తి రూ.100 నుంచి రూ250 వరకు, కళాయి రూ.500 నుంచి రూ.1000 వరకు, చిన్న సైజు పెనం రూ.300 నుంచి రూ.500 వరకు కత్తి పీట రూ.200 నుంచి రూ.350 వరకు అమ్ముతున్నారు.

ఇదే జీవనోపాధి



మా పెద్దల నుంచి వ్యవసాయ పనిముట్లు, వంట గదిలో అవసరమైన వస్తువుల తయారీ నేర్చుకున్నాం. గిరాకీ ఆధారంగా ఒక ప్రాంతంలో 10 రోజుల నుంచి రెండు వారాల వరకు తయారు చేసిన వస్తువులను ఇక్కడ విక్రయించి ఉపాధి పొందుతున్నాం. తెలుగు రాష్ట్రాల ప్రజలు మమ్మల్ని ఆదరిస్తున్నారు.

–మోహన్‌రత్రి, వలస కూలీ, మధ్యప్రదేశ్

చిన్నప్పటి నుంచి ఇదే పని



మా తల్లిదండ్రులు వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తూ ఈ పని మాకు అలవాటు చేశారు. మధ్యప్రదేశ్‌లో మా పనిముట్లకు గిరాకీ ఉండదు. అందుకే జీవనోపాధికోసం ఇక్కడకు వచ్చాం. బొగ్గులు, నిత్యావసర సరుకుల ఖర్చులు పోను రోజుకు రూ.400 నుంచి రూ500 వరకు సంపాదిస్తున్నాం.

– రాంబాబు

ఇక్కడ ఆదరణ బాగుంది



మధ్యప్రదేశ్‌లో పనిముట్లు తయారు చేసినా సరైన బేరాలు ఉండవు. అందుకే ఈ సీజన్‌లో ఐదు నుంచి ఆరు నెలలు ఆంధ్రప్రదేశ్‌లోనే వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ ఉపాధి పొందుతుంటాం. గతంలో మాదిరిగా గ్రామాల్లో పనుముట్లు తయారు చేసే వారు కరువయ్యారు. దీంతో మాకు ఇక్కడ ఆదరణ ఉంటోంది.

– రాణి

మన ఊరు మన వంతు సేవ



దిమిలిలో నిత్యావసర సరుకులు అందజేస్తున్న సభ్యులు

రాంబిల్లి: మన ఊరు మన వంతు సేవ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం పలువురు పేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఉచిత వైద్య శిబిరాలు, చలివేంద్రాల నిర్వహణ, ప్రమాదాల్లో గాయపడిన వారికి ఆర్థిక సాయం చేయడం వంటి పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మన ఊరు మన వంతు సేవ గ్రూపు ఆర్గనైజర్ బొద్దపు మాణిక్యం తెలిపారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం



పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి

ఎస్.రాయవరం: కొరుప్రోలు గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామివార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుమ్మరాబయల వేంచేయున్న శ్రీ అభయాంజనేయ స్వామికి ప్రతి ఏడాది వార్షికోత్సవం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి, భారీ అన్న సమారాధన నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా వేకువజామునుంచి దంపతులతో కుంకుమ పూజలు, సింధూర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి సన్నిధిలో భక్తులక అన్న ప్రసాదం అందజేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పార్టీ విజయమే ధ్యేయంగా పనిచేద్దాం



సమన్వయకర్త కంబాల జోగులును అభినందిస్తున్న నాయకులు

పాయకరావుపేట : వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ విజయమే ధ్యేయంగా అందరం కలిసి పనిచేద్దామని, చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకుంటూ సమష్టిగా పార్టీ విజయానికి కృషి చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఆదివారం మండలంలో గల నామవరం, పీఎల్‌పురం గ్రామాలను సందర్శించి, ఆయా గ్రామాల్లో గల వైఎస్సార్సీపీ నాయకుల్ని పరిచయం చేసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు ఆయా గ్రామాల్లో నాయకుల్ని సమన్వయకర్త కంబాల జోగులుకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అన్నింటిని నేరవేర్చిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎన్ని పార్టీలు ఏకమైనా సరే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు. నవరత్నాలు పథకాలు పేదలందరినీ అభివృద్ధి చేశాయన్నారు. అమ్మ ఒడి, ఆరోగ్య శ్రీ, నేతన్న నేస్తం, ఆసరా, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, నాడు–నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి, పీహెచ్‌సీ నిర్మాణం, అందరికీ ఆరోగ్యం వంటి బృహత్తరమైన పథకాలు, ప్రణాళికబద్ధంగా పాలన రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాలు యథాప్రకారం కొనసాగాలంటే మరలా మనందరం జగన్ మోహన్‌రెడ్డినే గెలిపించుకోవలసి ఉందన్నారు. అనంతరం ఆయా గ్రామాల నాయకులు కంబాల జోగులను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పీఎల్ పురం సర్పంచ్ పడాల సోమన్నదొర, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి వై.అన్నవరం, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బొద్దా శ్రీదేవి, పల్లేల వెంకట్, పిరాధి రాజు, జగతా శ్రీను పాల్గొన్నారు.

విజయం చిన్నదైనా స్ఫూర్తి ఉజ్వలం



విద్యార్థులను అభినందిస్తున్న విజయ్ ప్రకాష్

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో ఆదివారం అభినందన కార్యక్రమం కన్నుల పండవలా జరిగింది. విద్య, సాంస్కృతిక, క్విజ్, ఆటల పోటీలు, పోటీ పరీక్షలు వంటి అనేక అంశాల్లో జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి, జిల్లా, పట్టణ స్థాయిలో ప్రతిభ కనబరిచిన, నూటికి నూరు శాతం హాజరు కనబరిచిన శ్రీ ప్రకాష్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులతో పాటుగా విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 900 మంది జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి, జిల్లా, పట్టణ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులకు స్కూల్ స్థాయి నుంచి కూడా విజయకాంక్ష వుంటుందని, కేవలం చదువులోనే కాకుండా వారికి ఇతర రంగాలలో కూడా అవకాశం కల్పించాలని శ్రీ ప్రకాష్ అన్ని రంగాలలోనూ ప్రాధాన్యం ఇచ్చి శిక్షణ ఇస్తోందని తెలిపారు. విజేతలకు స్ఫూర్తి పెంపొందించడం కోసం వారికి జ్ఞాపికలు కాకుండా పుస్తకాలు ఇస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల వివిధ విభాగాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామదేవతల పండగ కమిటీ చైర్మన్‌గా ఈశ్వరరావు



గవర్ల అనకాపల్లి గ్రామ దేవతల పండగ కమిటీ చైర్మన్ ఈశ్వరరావుతో పాటు పాలకవర్గ సభ్యులు

మునగపాక : తోటాడ శివారు గవర్ల అనకాపల్లి గ్రామ దేవతల పండగలకు నూతన కమిటీ ఏర్పాటు చేశారు, కమిటీ చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మళ్ల ఈశ్వరరావు ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. గ్రామంలో జరిగే గ్రామ దేవతల పండగలు ఘనంగా నిర్వహించేలా కమిటీ సభ్యులు పాటుపడాలని కోటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో షేక్ ఇస్మాయిల్, కాండ్రేగుల శేషు, రాము, గున్నాజీ, నరేంద్ర, పరమేష్ పాల్గొన్నారు.

దళితవాడ రామాలయానికి ఎంపీపీ విరాళం



మునగపాక దళితవాడ రామాలయానికి విరాళం అందజేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : మునగపాక దళితవాడలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి దాతలు ముందుకొస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా పలువురు దాతలు తమ సహకారాన్ని అందిస్తున్నారు. దీనిలో భాగంగా మునగపాక ఎంపీపీ మళ్ల జయలక్ష్మి లక్షా వెయ్యి నూట పదహారు రూపాయలను విరాళంగా అందజేసి భక్తిని చాటుకున్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ నేతలు పిల్లి అప్పారావు, రాజాన బుజ్జి, బీలా అప్పలనాయుడుకు ఆమె తన విరాళం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు,పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాశీబాబు పాల్గొన్నారు.

బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌లో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

అచ్యుతాపురం: మండలంలోని కోనంపాలెంలో బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ఎమ్మెల్యే కన్నబాబు రాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రికెట్ బ్యాట్ పట్టుకొని బ్యాటింగ్ చేశారు. రూ.13 లక్షలతో అడిగర్ల సూర్య ఈ బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను నిర్మించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ పాల్గొన్నారు.

సందడిగా శ్రీకృష్ణుడి వార్షికోత్సవం



అలరించిన మహిళల కొలాటం



పూజలందుకుంటున్న శ్రీకృష్ణుడు

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ సన్యాసమ్మ చెరువు గట్టు వద్ద ఉన్న శ్రీకృష్ణుడి వార్షికోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. శ్రీకృష్ణుడికి పట్టణంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడిపెద్దు సేవ గరిడీలు, చెట్టుభజనలు, యలమంచిలి ఎన్‌టీఆర్ కాలనీ మహిళల కొలాటం ప్రదర్శన పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. ఆలయం వద్ద స్వామి వారి అన్న ప్రసాదాలు అందజేశారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు, బాణాసంచా అలరించాయి.

మూడు దశాబ్దాల తర్వాత అపూర్వ కలయిక



నక్కపల్లి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–94లో పదోతరగతి చదవిన పూర్వ విద్యార్థులంతా ఆదివారం పాఠశాలలో సమావేశమయ్యారు. ఇటీవల మరణించిన స్నేహితులను స్మరించుకుని వారి కుటుంబాలను ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. అప్పట్లో తమకు విద్యనేర్పిన గురువులను సత్కరించారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం

యలమంచిలి రూరల్ : ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మొదటి విడత ప్రయోగ పరీక్షలు ప్రారంభించినట్టు ఆయా పరీక్ష కేంద్రాల ముఖ్య పర్యవేక్షణాధికారులు తెలిపారు. పరీక్షల్లో అక్రమాలు జరగకుండా ప్రయోగశాలల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటి ప్రత్యక్ష ప్రసారాన్ని ఇంటర్ బోర్డు జిల్లా, ప్రధాన కార్యాలయాలతో అనుసంధానించారు. తద్వారా ప్రయోగ పరీక్షల్లో అక్రమాలు జరగకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు.

మత్స్యకారులకు రాజకీయంగా గుర్తింపు ఇవ్వాలి



జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు అమ్మోరయ్య

నక్కపల్లి : మత్స్యకారులకు వచ్చే ఎన్నికల్లో తగిన గుర్తింపు ఇచ్చిన పార్టీకే మద్దతు ఇవ్వాలని ఆంధ్ర మత్స్యకార జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నక్కపల్లిలో జేఏసీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు కంబాల అమ్మోరయ్య మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 30 లక్షల మంది మత్స్యకారులు ఉన్నారన్నారు. జనాభా ప్రాతిపదికన తగిన ప్రాధాన్యం ఉండడం లేదన్నారు. ఎన్నికల్లో ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే మత్స్యకారులను వాడుకుంటున్నారని ఆరోపించారు. కనీసం పది అసెంబ్లీ స్థానాలను, రెండు ఎంపీ స్థానాలను వాడ బలిజ మత్స్యకారులకు కేటాయించాలన్నారు. ఒక రాజ్యసభ స్థానాన్ని కూడా మత్స్యకారులకు ఇవ్వాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో కూడా మత్స్యకారులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. తీర ప్రాంతాల్లో ఉన్న మత్స్యకార గ్రామాలను కాలుష్య కోరల్లో నుంచి రక్షించాలన్నారు. ఈ డిమాండ్లను మేనిఫెస్టోలో చేర్చి అమలు చేస్తామని ప్రకటించిన పార్టీలకు మాత్రమే వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. తమ హామీలు నెరవేర్చని వారికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని జేఏసీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి ఉమ్మిడి సంజీవరావు అన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి పిక్కి కోదండరావు, జేఏసీ నాయకులు అప్పలరాజు, వెంకటేష్, నూకనాథం, రాజేష్, అర్జిల్లి శ్రీను, చోడిపల్లి ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘానికి సొంత భవనం

దాతల విరాళాలతో జోరుగా నిర్మాణ పనులు



బ్రాహ్మణ సంఘ భవనం వద్ద జరుగుతున్న పనులు

నక్కపల్లి : మండల కేంద్రంలో తాలూకా బ్రాహ్మణ సంక్షేమ సంఘ భవనానికి పలువురు సంఘ ప్రతినిధులు, సభ్యులు, శ్రేయోభిలాషులు విరాళాలు ప్రకటించడంతో అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు జోరందుకున్నాయి. పదేళ్ల క్రితం ఈ భవన నిర్మాణాన్ని సంఘ సభ్యులు, ఇతర దాతలు సమకూర్చిన సుమారు రూ.15లక్షల విరాళాలతో ప్రారంభించారు. తరువాత నిధులు సరిపోక భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. రెండు మాసాల క్రితం జరిగిన కార్తీక వన సమారాధన సమయంలో సంఘ పెద్దలు ఈ విషయాన్ని సర్వసభ్య కమిటీలో ప్రస్తావించడంతో పలువురు సంఘ సభ్యులు తమకు తోచిన రీతిలో విరాళాలు ప్రకటించారు. నక్కపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వీసం రామకృష్ణ, వీసం నానాజీ సుమారు లక్ష రూపాయల బోరు నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారు. పలువురు సంఘ ప్రతినిధులు సిమెంట్, ఇసుక, ఇతర మెటీరియల్‌ను విరాళంగా ప్రకటించడంతో నిర్మాణ పనులు జోరందుకున్నాయి. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల బ్రాహ్మణ సోదరులకు ఉపయోగపడే విధంగా ఈ భవనాన్ని తీర్చి దిద్దుతున్నామని సంఘ ప్రతినిధులు డి.వి.రామారావు, గొట్టుముక్కల వరప్రసాద్, శ్రీపాద ప్రణవ్, ఇంద్రకంటి బావి, పసర కొండ పండు, శ్రీపాద ప్రసాద్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



కొండకర్ల ఆవలో పూర్వపు విద్యార్థులు

అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల ఆవ ప్రాంతం ఆదివారం పూర్వ విద్యార్థులతో సందడి నెలకొంది. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1986–87లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కొండకర్ల ఆవ ప్రాంతంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాటి తీపి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సమావేశానికి ఎ.వి.ఎన్. మూర్తి, పి.వి. గిరిబాబు, బి.ఎం నాయుడు, వెలగా సురేష్‌కుమార్, బుద్ద నాగేశ్వరరావు , శ్రీహరి ప్రియ నేతృత్వం వహించారు.

అచ్యుతాపురంలో వైద్య శిబిరం

అచ్యుతాపురం: అచ్యుతాపురం శ్రీవిష్ణు ఆస్పత్రి వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీవిష్ణు ఆస్పత్రి 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సురక్ష హెల్త్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి,సీఐ బుచ్చిరాజు ప్రారంభించారు. ఈ శిబిరంలో 21 మంది రక్త దానం చేశారు. 29 చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 35 మందికి కాన్సర్ స్క్రీనింగ్, 40 మందికి డెంటల్ పరీక్షలు,180 మందికి జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించారు. రెడ్డి గణేశ్,ఎంపీటీసీ లాలం శ్రీను పాల్గొన్నారు.

బ్రాండిక్స్‌లో..

బ్రాండిక్స్ అపెరల్ పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 340 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి హాజరైన కంటి బాధితుల్లో 242 మందికి కళ్లద్దాలు అందజేశారు. 116 మందికి మందులు పంపిణీ చేశారు. 30 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని వైద్యులు సూచించారు. శిబిరంలో కంటి బాధితుల్ని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి పరామర్శించారు.